# ఆగామి ఆగామి వసంతం

-శ్రీధర శ్రీరామకృష్ణ

"చీకటి వెలుగుల రంగేళీ! జీవితమే ఒక దీపావళి" అని ఓ సినీకవి అన్నాడు. అది నా విషయంలో ఏమాత్రం నిజంకాదు. నా జీవితంలో చీకటితప్ప వెలుగు లేదు. చిన్నప్పట్నుంచి కష్టాలే.

చిన్నతనంలోనే అమ్మపోయింది. నాన్నరెండోపెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లిపెట్టే బాధలు భరిస్తూ, ఎలాగో ఇంటర్ మీడియట్ పూర్తిచేశాను. డిగ్రీ ఫస్టియర్‌లో ఉన్నప్పుడు నాన్నకూడా పోయారు. ఇక సవతి తల్లి పెట్టే కష్టాలకి అంతులేకుండా పోయింది. అయినా మౌనంగా భరిస్తూ వచ్చాను. ఇంతలో సవతి తల్లి మరొకరితో అక్రమసంబంధం ఏర్పరచుకుంది. ఇదేమిటని నిలదీసి అడిగితే, బయటకు పొమ్మని మెడపట్టి గెంటేసింది.

అప్పట్నుంచి, తెల్సున్న వాళ్ళింట్లో వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద బతుకుతూ, దూరపు బంధువుల సాయంతో డిగ్రీ పూర్తిచేశాను. ఒక ప్రైవేట్ కంపెనీలో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది.

తర్వాత, సుధీర్ తారసపడ్డాడు. ప్రేమగా, ఆత్మీయంగా మాట్లాడే వాళ్ళే కరువైన ఎడారిలాంటి నా జీవితానికి అతని మాటలు అమృతజల్లులా అనిపించాయి. తియ్యని మాటలు మాట్లాడుతూ నన్ను లోబర్చుకోవాలని చూశాడు. జీవితంలో ఆటుపోట్లు తిన్నదాన్ని గనుక అంతతేలికగా లొంగలేదు. పెళ్ళి అనే తాయిలం చూపించి ఓ ఏడాదిపాటు వాడుకున్నాడు. ఒకనాడు పెళ్ళి గురించి గట్టిగా అడిగితే మళ్ళీ కనబడకుండా పోయాడు. పెళ్ళిమత్తు లోపడి అతని వివరాలేమీ సేకరించకపోవటం చాలా తప్పైంది. గుడ్డిలో మెల్ల. ఆ దేవుడి దయవల్ల నాకు గర్భం రాలేదు. అప్పట్నుంచి జీవచ్ఛవంలా బతుకు నెట్టుకొస్తున్నాను.

ఈ మధ్య ఆఫీసులో అటెండర్ సుబ్బారావు కూడా రెండర్థాల మాటలు మాట్లాడ్డం మొదలు పెట్టాడు. తోడూ, నీడాలేని ఒంటరి దాన్నని, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాననీ వాడే కనిపెట్టినట్టున్నాడు అక్కడే వాణ్ణి నాలుగూ దులిపేద్దామా అనిపించింది. కానివాడు చాలా తెలివిగా తప్పించుకుంటాడు నేనే అల్లరైపోతాను. అందుకే కోపాన్ని నాలోనే దిగమింగుకున్నాను.

సాయంత్రం ఆఫీసయ్యాక, మనసుబాగోక అలాకాసేపు బజార్లో తిరిగివద్దామని బయల్దేరాను. దార్లో శ్రీలేఖ కనిపించింది. తను నా చిన్ననాటి స్నేహితురాలు. నన్ను చూసి కౌగిలించుకుంది. చాలా రోజుల తర్వాత, చిన్ననాటి నేస్తమైన నన్ను కల్సుకున్నందుకు ఎంతో సంతోషించింది. దగ్గర్లో ఉన్న స్టార్‌హోటల్‌కి తీసుకెళ్ళింది. టిఫిన్‌తిని, కాఫీతాగాం. బిల్లుతనే పే చేసింది. తనతో బాటు కార్లో నన్ను వాళ్ళింటికి తీసుకొచ్చింది.

టేబుల్‌పైన ఉన్న మాగజైన్స్ చూస్తూ ఉండమని చెప్పి, లోపలికెళ్ళి డ్రెస్‌చేంజ్ చేసుకుని వచ్చింది.

నా పక్కనే కూర్చుని నే ఎక్కడ ఉండేది మొదలైన



వివరాలన్నీ అడిగింది. చెప్పాను.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది.

శ్రీలేఖ వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పదహారేళ్ళ కుర్రాడు.

'ఫిక్స్‌వెల్ లామినేషన్స్ నుంచి వచ్చానమ్మా! రెండ్రోజుల క్రితం, సార్ మీ ఫామిలీ ఫోటో ఇచ్చి, లామినేషన్ చేసి పంపమని బిల్‌కూడా పే చేశారు.' అంటూ తనకి ఒక పెద్ద లామినేటెడ్ ఫోటో అందించి వెళ్ళిపోయాడు.

'మా హనీమూన్ ట్రిప్‌లో తీయించుకున్న ఫోటో. ఆయన ద్వారా రెండ్రోజుల క్రితం లామినేషన్‌కు పంపాను. తీసుకొచ్చాడు. ముందుగా మా ఆయన ఫోటో చూడు. తర్వాత మనిషిని చూద్దువుగాని' నవ్వుతూ అంటూ దాన్ని నాకందించింది శ్రీలేఖ.

ఆ ఫోటోని చూడగానే నాకు కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది.

స్పృహ తప్పుతుందేమోనన్నంత నిస్సత్తువ కలిగింది.

గుండెనెవరో గట్టిగా పిండినట్టైంది.

తాము హనీమూన్ ట్రిప్ ఎలా ఎంజాయ్ చేసింది, అక్కడి రాత్రుళ్ళు తన భర్త ఎన్నిసార్లు, ఎలా, చిలిపిగా ప్రవర్తించిందీ చెబ్తూ ఉంది శ్రీలేఖ.

అవేమీ నా చెవి కెక్కటం లేదు.

ఇంకో నిమిషం అక్కడ కూర్చుంటే నేనేమైపోతానోనన్నంత భయం కలిగింది నాలో.

కారణం- శ్రీలేఖ భుజం మీద చేయివేసి దగ్గరగా నుంచుని చిద్విలాసంగా నవ్వు తున్నాడు సుధీర్, ఫోటోలో.

"వస్తాను శ్రీలేఖా! ఇప్పటికే చాలా పొద్దు పోయిం ది.' అంటూ కుర్చీలోంచి లేచినుంచున్నాను.

'మా ఆయన్ని చూడకుండా నేనా!' అడిగింది శ్రీలేఖ.

సమాధానంగా చిరునవ్వు నవ్వి, తన అనుమతి కోసం ఎదురు చూడకుండా, బయటికొచ్చాను. బయటికొచ్చేముందు స్థిరంగా నిర్ణయించుకున్నాను. 'నన్ను మోసంచేసి, వేరే పెళ్ళి చేసుకుని, అతను హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటే, స్వశక్తి మీద నిలబడగలిగిన నేను మాత్రం గతాన్ని తల్చుకుని ఎందుకు బాధపడాలి? జరిగిందాన్నో పీడకలగా భావించి, ఈ మధ్యే మా దూరపు బంధు వొకాయన తీసుకొచ్చిన మంచి సంబంధానికి సమ్మతి తెలియ జేయాలి. అప్పుడు ఈ అటెండర్ సుబ్బారావు లాంటి వాళ్ళ నోళ్ళుకూడా మూత బడతాయి.'

ఎక్కడో దూరంనుంచి కోయిల కూసింది. నా జీవితంలో రానున్న వసంతానికి స్వాగతగీతిలా!

★